నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ ఈటల, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

శ్రీపురం కాలనీలో పార్కు, వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, నవంబర్ 16 : మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లలో రూ.6 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. శ్రీపురం కాలనీలో రూ. 54లక్షలతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, పార్కును, హరిహరపురంలో రూ.46.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, శ్రీరామ్‌నగర్‌లో రూ.26 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు హన్మంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌గౌడ్, జంగయ్యగౌడ్, నర్సింహారెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దీప, సుహాసిని, శ్వేత, శిరీశ్‌కుమార్ పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

హయత్‌నగర్: నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకాలనీలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని సూర్యనగర్ కాలనీలో రూ.కోటి 40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ. కోటి 67 లక్షలతో ఇన్‌ఫర్మేషన్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మహాగాయత్రీనగర్ నుంచి కుమ్మరికుంట వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.19 లక్షలతో సుష్మాసాయినగర్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తులో నిర్మించనున్న మహిళా భవనం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ

ఆర్కేపురం, నవంబర్ 16 : సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 40వ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీ వీరాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనంరెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, రవీందర్‌రావు, రవీందర్‌రెడ్డి, కనకరావు, మారోజు శ్రీనివాస్‌చారీ, కృష్ణమాచార్యులు, వంశధాకాచార్యులు, రామకృష్ణమాచార్యులు, శ్యాంసుందర్‌శర్మ తదితరులు ఉన్నారు

జమాతే సభ్యులు సమాజానికి చేరువ కావాలి

జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదుతుల్లా హుస్సేనీ

బడంగ్‌పేట,నవంబర్16: జమాతే సభ్యులు సమాజానికి చేరువ కావాలని జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ సాదుతుల్లా హుస్సేనీ తెలిపారు. మహేశ్వరం నియోజక వర్గ పరిధిలోని పహాడీషరీఫ్‌లోని హుడా గ్రౌండ్‌లో జమాతే ఇస్లామీ హింద్ అఖిల భారత సదస్సు రెండో రోజు జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు ముస్లిం సమాజానికి అతీతంగా విస్తరించాలన్నారు. ప్రజల అవగాహనలో సానుకూల మార్పులు తీసుకు రావాలన్నారు. వ్యక్తిగత సహకారం, సేవా ధృక్పదం కలిగి ఉండాలన్నారు. 2025 సంవత్సరాన్ని రైస్ సంవత్సరంగా ప్రకటించుకోవలసిన అవసరం ఉందన్నారు. భావితరాలకు మంచి చేసినప్పుడే విజయం సాధించినట్లవుతుందన్నారు. సంస్థను బలోపేతం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. విద్యార్థి సంఘాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. ఉద్యమంలో మహిళల పాత్ర గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు జేబహెచ్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఖలీద్, ఎస్ఐవో జాతీయ అధ్యక్షుడు సుమయ్య రోషన్, రహ్మాతునీసా, అమీనుల్ హసన్, ప్రొఫెసర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకం

నాగోల్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమైందని నోస ప్రెసిడెంట్ కందికంటి కన్నాగౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ తెలిపారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అనంతుల వేణుగోపాల్‌గౌడ్, కొత్త జగన్ సంస్మరణ సభను నోసా ఆధ్వర్యంలో శనివారం నాగోల్ చౌరస్తాలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నోస సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెండు వెంకట్‌రెడ్డి, బొడ్డుపల్లి సురేశ్, ప్రదీప్‌కుమార్, సిద్ధి రమేశ్, నాళ్ల ఉమామహేశ్వర్ గుప్తా, లింగంగౌడ్, వర్కల బాలరాజు, అనంతుల శ్రీనివాస్, నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

–మన్సూరాబాద్, నవంబర్ 16:

విద్యార్థులకు వేగంగా చదవడంపై పోటీ

ప్రభుత్వ డిగ్రీ గ్రంథాలయ వారోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

హయత్‌నగర్, నవంబర్ 16 : చిరిగినా చొక్కానైనా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో అని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. శనివారం గ్రంథాలయ సమాచారం కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పీడ్ రీడింగ్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించామని తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో వేగంగా చదవడం లో విద్యార్థులు పోటీ పడ్డారని, చక్కగా ఈ స్పీడు రీడింగ్ ద్వారా విద్యార్థులు అక్షర దోషాలు లేకుండా చదవడంలో మంచిపట్టును సాధించవ్చని, జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించామని కళాశాల గ్రంథపాలకులు డాక్టర్ ఆనంద్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగరాజు, డాక్టర్ నర్సయ్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం

ఆర్కేపురం, నవంబర్ 16 : ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్షదీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పరమ శివుడిని తలుచుకుంటూ కార్తీక దీపాలను వెలిగించారు. దీంతో దేవాలయం పరిసర ప్రాంతాలు దీపాల వెలుగులతో నిండిపోయాయి. వాసవీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా, కోశాధికారి కృష్ణయ్య, కన్వీనర్ తమ్మన శ్రీధర్, గౌరిశెట్టి అరుణ్, సుదర్శన్, మధురఉపేందర్‌రెడ్డి, సుజాత, అరుణ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి


హెచ్ఎం శ్రీనివాస్‌కు చెక్కును అందజేస్తున్న దాతలు

మన్సూరాబాద్, నవంబర్ 16: పేద ప్రజలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని ఉప్పల మండల విద్యాధికారి రామారావు కోరారు. నాగోల్ డివిజన్ పరిధి జైపురి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం సంగారెడ్డి జిల్లా కల్లేరు ఎంఈవో గంజి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మల్లేశ్ రూ. 8 వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రామారావు మాట్లాడుతూ క్వాలిఫైడ్ టీచర్ల విద్యాబోధనలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎంతో మంది ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు బ్యూల పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

ఉప్పల్, నవంబర్ 16: డివిజన్‌లోని డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ శనివారం జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. భూగర్భ డ్రైనేజీ పనులు చేయకపోవడంతో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి

శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు

సైదాబాద్, నబంబర్ 16 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషి చేస్తానని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం సైదాబాద్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కోట్ల శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయం కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్‌లో వ్యాపారుల దళారుల వ్యవస్థ నిర్మూలించటంతోపాటు, అధికారుల అవినీతి, అక్రమాలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు మార్కెట్‌లో మౌలిక వసతులను కల్పించటానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవటమే తన సంకల్పమన్నారు. శ్రీనివాస్ దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు నేరెళ్ల ప్రసాదరావు, రాజ్యలక్ష్మి, భక్తులతో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోడ్డు పక్కన సంతతో ఇక్కట్లు

- స్థలం కేటాయించాలని వ్యాపారుల వేడుకోలు

రోడ్డు పక్కన క్రయ విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

కందుకూరు, నవంబర్ 16 : మండల కేంద్రంలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. కందుకూరు, హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై కందుకూరు మండల కేంద్రం ఉండటంతో అంచలంచెలుగా అభివృద్ధి చెంది వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. దీంతో పంచాయతీ పాలకవర్గం ప్రతి ఆదివారం సంత నిర్వహించడానికి నిర్ణయించింది. కూరగాయాలు, వ్యాపారంతో పాటు మేకలు, గొర్రెల సంతను కూడా నిర్వహిస్తున్నారు. ఈ సంత ప్రతి ఆదివారం కందుకూరు యాచారం మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. లక్షల్లో వ్యాపారం కొనసాగుతుంది. రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహిస్తుండటంతో వ్యాపారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు. సంత నిర్వహించడానికి స్థలం లేదు. మేకల,గొర్రెల సంతను ప్రైవేట్ వెంచర్‌లో నిర్వహిస్తున్నారు. అది ప్రైవేట్ స్థలం కావడం అక్కడ కనీస వసతులు లేవు. వ్యాపారస్తులు, క్రయ విక్రయదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం వేలం ద్వారా పంచాయతీకి లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికి కనీసం వసతులు కల్పించకపోవడంపై వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థలం కేటాయించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ప్రశంసనీయం

మాట్లాడుతున్న కో ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ రోజారాణి, బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్

మలక్‌పేట, నవంబర్ 16: వికసిత్ భారత్‌లో వ్యవస్థాపకత, ఉద్యోగకల్పన, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించటంలో సహకార సంఘాలు(కో ఆపరేటివ్ బ్యాంకులు) పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని గోల్కొండ డివిజన్ కో ఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ రోజారాణి అన్నారు. దేశాభివృద్ధి, జీడీపీ పెంపుదలలో సహకార సంఘాలు(బ్యాంకుల) ముఖ్య భూమికను పోషిస్తున్నాయని ఆమె తెలిపారు. 71వ ఆలిండియా కో ఆపరేటివ్ వీక్ వేడుకల్లో (సహకార బ్యాంకల వారోత్సవాల్లో) భాగంగా శనివారం పాతమలక్‌పేట డివిజన్‌లోని తిరుమల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో నిర్వహించిన కో ఆపరేటివ్ వీక్ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కో ఆపరేటివ్ బ్యాంకుల పతాకాన్ని ఆవిష్కరించిన వారు, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపటమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ జాయింట్ రిజిస్ట్రార్ సంగీత మాట్లాడుతూ సహకారం అంటేనే ఒకరికోసం అందరూ, అందరికోసం ఒకరు అని, సహకార బ్యాంక్‌లు అంటేనే సహకారం అందించే సంఘాలని అర్థమన్నారు. తిరుమల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ తిరుమల బ్యాంకు కో ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా నడుస్తుందని, బ్యాంక్ సిద్ధాంతాలను తుచ తప్పకుండా పాటిస్తూ కస్టమర్లకు మెరుగైన సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తిరుమల కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, చీఫ్ మేనేజర్ రవిశంకర్, అసిసెంట్ రిజిస్ట్రార్ శారదమ్మ, గాయకుడు బాల సుబ్రమణ్య శర్మ, బ్యాంక్ డైరెక్టర్లు, వాణి పాఠశాల విద్యార్థులు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

మైలార్‌దేవ్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: పద్మశాలి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ సుధాకర్ అన్నారు. జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భవన రుషీనగర్ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మచ్చ సుధాకర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే యువజన, చేనేత, మహిళా, న్యాయవాదులు, ఇతర విభాగాలకు కూడా ప్రతినిధులను ఎన్నుకొని ప్ర మాణస్వీకారాలు చేపట్టారు. వేముల వెంకన్న, ఏర్వ సత్యనారాయణ, కాశిగారి యాదగిరి, కోట జనార్ధన్, చిప్ప లక్ష్మి, నర్సింహమూర్తిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం నూతన సభ్యులకు నియామకపత్రాన్ని అందజేసి శాలువాలతో సత్కరించారు. సంఘం అధ్యక్షులు మచ్చ సుధాకర్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం పట్ల నాయకత్వం చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

పుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాంరెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: ప్రజల సౌకర్యార్థం కోసం నిర్మించిన పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రాంరెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్‌లు అన్నారు. శనివారం లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి హైదర్‌గూడ సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా నుంచి నంది ముస్లాయిగూడ చౌరస్తా వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా పాదచారుల అవసరాల నిమిత్తం పుట్‌పాత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొందరు ఈ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. నడిచేందుకు దారి లేక పాదచారులు ప్రధాన రహదారులపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే వ్యాపార సముదాయాలను తీసి వేయాలన్నారు. లేని పక్షంలో తామే వీటిని నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి

నేతాజీనగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

చర్లపల్లి, నవంబర్ 16: డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో శనివారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించి కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతాజీనగర్ కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరక్టర్ బాల్ రెడ్డి, నాయకులు ప్రభుగౌడ్, గోపాల్‌యాదవ్, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్ ఐలేందర్, గణేశ్‌గౌడ్, అశోక్, శ్రీనివాస్‌రాజు, సువర్ణ, పద్మావతి, అలేఖ్య, సత్తెమ్మ, సంధ్య, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పాండు, వెంకట్‌గౌడ్, శ్రీనివాస్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని తెలిపారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ టెక్నీషియన్స్, రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30 ఆఖరు అని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన నూతన ప్రిన్సిపాళ్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ పదవుల్లో కొత్త వారిని నియమించిన నేపథ్యంలో వారు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కాసిం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.ప్రభాకర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఐ.శేఖర్, లా కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంప్రసాద్ బాధ్యతలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు బీజేపీ ముందుండి పోరాడుతుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ మూసీ పరీవాహక బాధితుల కోసం ఒక రోజు నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరిసర ప్రాంతాల్లో బాధితుల ఇంటికెళ్లి భరోసా కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు పక్కనపెట్టి రేవంత్‌రెడ్డి చేస్తు న్న నీతిమాలిన వ్యాఖ్యలు మీరు వెళ్లి అక్కడ మూసీ ప్రాంతంలో నిద్ర చేసి రండి అని చెప్పడం దానికి దీటుగా ప్రజలకు భరోసా కల్పిస్తూ బీజేపీ నాయకులంతా కలిసి పరిసర ప్రాంతాల్లో బస చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ కర్కశ పాలనలో పేదలకు గూడు–నీడా దూరమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, మోం డ్ర కొమురయ్య, అంజన్‌కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, 16: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెట్ ఇంజినీర్ ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు కాటేదాన్ పారిశ్రామికవాడ, సాయిబాబానగర్ పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.